సాక్షి
నంద్యాల

ఆదివారం | 2 | జూన్ | 2024



పోలీస్ హై అలర్ట్

జూన్ 4న పోలీసు శాఖ హై అలర్ట్ ప్రకటించింది. ఓట్ల లెక్కింపు జరిగే రాయలసీమ యూనివర్సిటీకి రెండు కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలు పోలీసుల ఆధీనంలోకి వెళ్లాయి. 8లో▸



మనసుకూ చికిత్స అవసరం

శరీరంతో పాటు మనసుకూ చికిత్స అందించాలని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి అన్నారు. శనివారం కర్నూలులో మానసిక వైద్యుల సదస్సు ప్రారంభమైంది. 8లో▸



మద్దిలేటయ్య క్షేత్రం కిటకిట

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి దర్శించుకునేందుకు శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు.వివిధ సేవలతో స్వామికి రూ.6,439,29 ఆదాయం లభించింది.

న్యూస్‌రీల్

శ్రీశైలంలో వేసవి రద్దీ



క్యూ లైన్‌లో పోటెత్తిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల క్షేత్రంలో వేసవి రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు శ్రీగిరికి తరలి వస్తున్నారు. శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలం చేరుకుని స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుతీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండి పోయాయి. భక్తులకు స్వామి అమ్మవార్ల సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలువురు భక్తులు మల్లన్నకు రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.

ప్రశాంతంగా పది సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సంస్కృతం పరీక్షను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించినట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో 11 పరీక్ష కేంద్రాల్లో 26 మంది విద్యార్థులకు గాను పది మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

74 శాతం పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో 74 శాతం పింఛన్ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. జిల్లాలో 54,408 మంది పింఛన్‌దారులకు గాను 40,600 మందికి మొదటి రోజే ఇంటి వద్దకు వెళ్లి గ్రామ సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారన్నారు. అలాగే బ్యాంక్ అకౌంట్లలో 1,67,294 మందికి వేసినట్లు తెలిపారు. పింఛన్ పంపిణీ కార్యక్రమం 5వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, అంగవైకల్యం కల వారు తదితర పింఛన్‌దారులు పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

కర్నూలు సిటీ: పాలిసెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లింపు గడువు నేటితో(ఆదివారంతో) ముగియనుంది. గత నెల 24 నుంచి https://appolycet.nic.in అనే వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించిన విద్యార్థుల విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన గత నెల 27 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ఉంటుంది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం7వ తేదీ నుంచి 10 వరకు కాలేజీ, కోర్సు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఆప్షన్లు మార్చుకునేందుకు 11వ తేదీ అవకాశం ఇచ్చారు. సీట్ల కేటాయింపు 13వ తేదీన జరగనుంది.

డీసీఎంఎస్‌లో టార్పాలిన్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా టార్పాలిన్‌లు పంపిణీ చేస్తున్నట్లు చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇసుక తరలింపులో టార్పాలిన్‌లు తప్పనిసరి చేసిందని, ఈ నేపథ్యంలో వీటిని సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన అన్ని రకాల సైజుల టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇసుక తరలించే వారు, ట్రాక్టరు యజమానులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌంటింగ్‌కు సర్వం సన్నద్ధం

- సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు
- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8.30కు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం
- శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె నియోజకవర్గాల కౌంటింగ్
- ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీశైలం, నందికొట్కూరు, ఫార్మా కాలేజీలో డోన్ ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన మూడంచెల భద్రత
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు కోసం సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ హాళ్లలో ఏర్పాట్లు, సిబ్బంది, ఏజెంట్లు పాటించాల్సిన నిబంధనలు, బందోబస్తు తదితర వివరాలను వారు వివరించారు. సమావేశంలో కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 'ఉదయం 8 గంటలకు జిల్లాలోని పార్లమెంట్, ఆరు అసెంబ్లీలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టి అనంతరం 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తాం. నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలో ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలకు సంబంధించి, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఫార్మసీ కాలేజీలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఓట్ల లెక్కింపుపై కౌంటింగ్ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేశాం. ఈ నెల 3వ తేదీ రెండవ ర్యాండమైజేషన్ పూర్తి చేసి శిక్షణ ఇస్తాం. ప్రతి నియోజకవర్గానికి ఒక కౌంటింగ్ హాల్, పార్లమెంట్‌కు మరొక కౌంటింగ్ హాల్ చొప్పున 12 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. నంద్యాల పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మరొక కౌంటింగ్ హాల్‌ను సిద్ధం చేశాం. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లు ఏర్పాటు చేశాం. రౌండ్ల వారీగా అభ్యర్థులకు పోలైన ఓటర్ల వివరాలను మీడియా సెంటర్‌లో వెల్లడిస్తాం. అన్ని స్థానాల ఓట్ల లెక్కింపు ఫలితాలు 4వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా పూర్తి చేస్తాం' అని వివరించారు.

ఏజెంట్లు ఉదయం 6.30 గంటలకు హాజరు కావాలి..

స్ట్రాంగ్ రూము తెరిచే సమయం ఉదయం 6.30 గంటలకు లెక్కింపు కేంద్రం వద్దకు ఏజెంట్లు హాజరు కావాలని ఇప్పటికే సూచించాం. ఈవీఎం ఓట్ల లెక్కింపు కేంద్రానికి, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశాం. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేస్తాం' అని తెలిపారు.

ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు..

కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. మొబైల్ ఫోన్లు, కెమెరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించం. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17సీ ఫారం, తెల్లకాగితం మాత్రమే తీసుకొని రావాలని రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేశాం' అన్నారు.

కౌంటింగ్ కేంద్రాలకు పటిష్ట భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాం. రాష్ట్ర, ప్రత్యేక బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నాం. అభ్యర్థులు కౌంటింగ్ సిబ్బంది ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిన వారు, ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తాం. కౌంటింగ్ ఆవరణానికి కిలో మీటర్ పరిధిలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్లు మినహా ఇతరులు ఎవరికీ కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదు. ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించిన తర్వాత కౌంటింగ్ పూర్తయ్యే వరకు బయటకు వెళ్లడానికి వీలు లేదు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదు.

– రఘువీర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ, నంద్యాల

పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద బందోబస్తు..

ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఎటువంటి విజయోత్సవాలు జరుపుకోకుండా, శాంతిభద్రతలు కాపాడేందుకు రాజకీయ పార్టీల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. 'ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎస్పీ, అదనపు ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 35 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు 68 మంది, పోలీసులు 133, హోంగార్డులు 101 మంది కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తులో ఉంటారు. వీరితో పాటు స్పెషల్ పార్టీ, బీఎస్‌ఎఫ్ బలగాలు, ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది విధుల్లో ఉంటారు. జిల్లాలో 75 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసు పికెట్ ఏర్పాటు చేశాం. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పార్టీలు, క్యూఆర్‌టీ, స్పెషల్ పార్టీ టీములు ఏర్పాటు చేశాం.

కౌంటింగ్ ప్రాంతం రెడ్‌జోన్...

ఆర్‌జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీ, ఫార్మసీ కాలేజీ ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ఏర్పాటు చేసి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ఇతరులు ఎవరూ ఆ పరిధిలో ఉండకూడదు. డ్రోన్లు ఎగురవేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, మీడియా సిబ్బందికి వాహనాల పార్కింగ్‌కు స్థలాలు ఎంపిక చేశాం. శ్రీశైలం, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాలకు సంబంధించిన వాహనాలు పార్టీల వారీగా కేశవరెడ్డి స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి. డోన్, బనగానపల్లె నియోజకవర్గాలకు చెందిన టీడీపీకి సంబంధించిన వాహనాలు బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి. డోన్, బనగానపల్లె, నియోజకవర్గాలకు సంబంధించిన వైఎస్సార్‌సీపీకి చెందిన వాహనాలు ఎస్టీ వెల్ఫేర్ స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి. కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులకు చెందిన వాహనాలు ఆర్‌జీఎం హాస్టల్ క్యాంపస్‌లో పార్కింగ్ చేయాలి.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ పద్మజ



కౌంటింగ్ కేంద్రాల సమీపంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్



జై.. హనుమాన్

శిరివెళ్ల మండలం వెంకటాపురంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జిల్లాలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పవన పుత్రుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పలుచోట్ల హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ధార్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయుడి విగ్రహాలతో గ్రామోత్సవాలు జరిపారు. – నంద్యాల(వ్యవసాయం

బీసీజీ వ్యాక్సినేషన్ వేగవంతం చేయండి

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

కొత్తపల్లి: మారుమూల గ్రామాల్లో సైతం క్షయవ్యాధి నివారణ కోసం వేస్తున్న బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని నంద్యాల డీఎంహెచ్‌ఓ వెంకటరమణ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఇమ్యూనేషన్ అధికారిణి (డీఐఓ) ప్రసన్నలక్ష్మీతో కలసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది విధుల రిజిస్టర్లు, వ్యాక్సినేషన్ రిజిస్టర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎదురుపాడు గ్రామంలో 104 అంబులెన్స్ ద్వారా అందుతున్న వైద్యసేవలను సిబ్బంది తెలుసుకున్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలు, వారి ఆరోగ్య స్థితిగతులు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్షయవ్యాధి బాధితులు, వారి కుటుంబ సభ్యులకు ఈ వ్యాక్సిన్ వేయడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చునన్నారు. చిన్నారులకు ఎంఆర్–1, ఎంఆర్–2 టీకాలు తప్పకుండా వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీపీఎం సునీత, అనిమియా మానిటరింగ్ అధికారి శ్రీజ, డాక్టర్లు మహమ్మద్ భేగ్,దీపానాగవేణీ, విజయేంద్ర, సీహెచ్‌ఓ బాలకృష్ణ ఉన్నారు.



గోకవరం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

పసుపు క్వింటా రూ.14,500

కొలిమిగుండ్ల: దశాబ్ద కాలం తర్వాత పసుసు పంటకు మార్కెట్‌లో మంచి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం తిమ్మనాయినిపేటలో వైఎస్సార్ జిల్లాకు చెందిన వ్యాపారులు పసుపు రైతుల నుంచి క్వింటా రూ.14,500కు కొనుగోలు చేశారు. గ్రామంలో ఏటా 120 ఎకరాలకు పైగానే పసుపు పండించేవాళ్లు. పెద్దల కాలం నుంచి ఇక్కడి రైతులు పసుపు పండించడం ఆనవాయితీగా వస్తుంది. కాగా పదేళ్ల క్రితం నుంచి ఏటా ధరలు పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టాలు ఎదుర్కొవాల్సి వచ్చింది. ఈ కోవలోనే తిమ్మనాయినిపేట రైతులు మార్కెట్‌లో ధర లేక పోవడంతో ఈ ఏడాది కేవలం 30 ఎకరాల్లో మాత్రమే పసుపు సాగు చేశారు. ఊహించని విధంగా పంట దిగుబడులు చేతికొచ్చే సరికి మంచి ధర పలకడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

విత్తన దుకాణాలపై విజి'లెన్స్'

వెల్దుర్తి(కృష్ణగిరి): విత్తన దుకాణాలపై శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. వెల్దుర్తిలో పలు దుకాణాల్లోని రికార్డులను, విత్తన ప్యాకెట్లను విజిలెన్స్ సీఐ కేశవరెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీకే విత్తనాలను అందించాలన్నారు. అనుమతి లేని విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలాజీ సీడ్స్ దుకాణంలో స్టాక్ రిజిస్టర్ నమోదు చేయని రూ.3,29,130 విలువ చేసే విత్తనాల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. వీరి వెంట ఏఓ అక్బర్‌బాషా ఉన్నారు.



కళాశాల బెల్ మోగింది

- 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం
- అడ్మిషన్ల కోసం ప్రభుత్వ కాలేజీ సిబ్బంది ప్రచారం

నంద్యాల(న్యూటౌన్): నూతన విద్యా సంవత్సరం షురూ అయ్యింది. వేసవి సెలవుల అనంతరం జిల్లాలో జూనియర్ కళాశాలలు శనివారం పునఃప్రారంభమయ్యాయి. పూర్తి స్థాయిలో తెరుచుకోవడంతో పాటు తరగతులు కూడా మొదలయ్యాయి. దీంతో కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇప్పటికే ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశిత వార్షిక క్యాలెండర్ సైతం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 138 జూనియర్ కళాశాలలు ఉండగా అందులో 81 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. వీటిలో జిల్లాలో 19 ఏపీ మోడల్ కళాశాలలు, 27 కేజీబీవీ జూనియర్ కాలేజీలు, 21 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే అధికారుల ఆదేశానుసారం అడ్మిషన్ల డ్రైవ్ క్యాంపెయినింగ్‌లు నిర్వహిస్తున్నారు. కళాశాలకు సమీప ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాడు–నేడు కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలు, ల్యాబ్‌లు, డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా బోధన, నిష్ణాతులైన అధ్యాపకులు, బోధన విధానాలు, ఇంటర్ విద్యతో లభిస్తున్న భవిష్యత్తు అవకాశాలను వివరిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో గణనీయంగా అడ్మిషన్లు జరిపేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో 'స్పాట్'కు ఏర్పాట్లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ ఇంటర్మీడియెట్ బోర్డు ఆన్‌లైన్ స్పాట్ వాల్యూయేషన్ పేరిట సరికొత్త సంస్కరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. తాజాగా ముగిసిన అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు మూల్యాంకనాన్ని లాంఛనంగా ప్రారంభించేలా కసరత్తు చేస్తుంది. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభం కానుండగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాలేజీలు ప్రారంభం కావడంతో లెక్చరర్లు, టైంటేబుళ్ల ప్రకారం తమ పిరియడ్‌లలో పాఠాలు బోధిస్తూ అడ్మిషన్ డ్రైవ్ చేస్తూనే ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



చాపిరేవుల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినిని తమ కళాశాలలో చేరాలని అవగాహన కల్పిస్తున్న నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది

ప్రభుత్వ కళాశాలలపై ఆసక్తి చూపుతున్నారు



ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో పాఠాలు బోధించడంతో పాటు అన్ని వసతులు సౌకర్యాలతో విద్యను అందించేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుంది. అందుకే ప్రభుత్వ కళాశాల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. అడ్మిషన్ డ్రైవ్‌పై కళాశాలల్లో, గ్రామాల్లో క్యాంపెయినింగ్ నిర్వహించాం. కాలేజీలో పని చేస్తూనే అధ్యాపకులు ఆన్‌లైన్ స్పాట్ వాల్యూయేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

– సునీత, డీఐఈఓ, నంద్యాల

క్లుప్తంగా

జిల్లా కలెక్టర్‌ను కలసిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నూతనంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజనను డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఆసుపత్రిలోని పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ ఉన్నారు.

రిటైర్డ్ వైద్యులకు మళ్లీ అవకాశం



డాక్టర్ చంద్రశేఖర్, జిక్కిలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల రిటైర్డు అయిన వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్, నెఫ్రాలజిస్టు డాక్టర్ పీఎస్ జిక్కిలకు ప్రొఫెసర్లుగా నియమిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం వారు కర్నూలు మెడికల్ కాలేజీలోని కార్డియాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో విధుల్లో చేరారు. ఒక సంవత్సరం కాంట్రాక్టు పద్ధతిలో వీరు విధులు నిర్వహించనున్నారు. ఆయా విభాగాల్లో వైద్య విద్యార్థులకు బోధనతో పాటు రోగులకు వైద్యం అందించనున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్ అభినందించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

ఆళ్లగడ్డ: నల్లమలలో వెలసిన శ్రీపావన నరసింహస్వామి సన్నిధిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. చాగలమర్రి మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన నారాయణరెడ్డి (15) బంధువులతో కలసి స్వామి దర్శనానికి వచ్చాడు. కాగా నారాయణరెడ్డి అక్కడే ఉన్న కోనేటిలో ఈత కోసం దూకడంతో తలకు రాయి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 26 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 26 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 2,787 మందికి 2,536 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షలకు 423 మందికి 383 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. కర్నూలు డిగ్రీ కళాశాలలో ఆరుగురు, ఆర్‌సీ రెడ్డి డిగ్రీ కళాశాలలో ఐదుగురు, రవీంద్ర డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఎస్టీబీసీ కళాశాలలో ముగ్గురు, గూడూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇద్దరు, కర్నూలు శ్రీ సాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నంద్యాల సాధనా డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల, నంద్యాల ఎస్వీవై రెడ్డి డిగ్రీ కళాశాల, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 26 విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

పోలీస్ హై అలర్ట్!

- అల్లర్లపై 'పోలీస్ ఫోకస్'
- ముందస్తు చర్యలతో కట్టడికి కార్యాచరణ
- నో ఫ్లయింగ్ జోన్లుగా లెక్కింపు కేంద్రాలు
- ప్రశాంత కౌంటింగ్‌కు పటిష్ట భద్రత
- కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పహారా



ఎన్నికల విధుల్లో ఉన్న కేంద్ర పోలీసు బలగాలు (ఫైల్)

కర్నూలు: శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసు శాఖ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లా అంతటా జూన్ 4న హై అలర్ట్ ప్రకటించింది. జిల్లాలో మరో వారం రోజుల పాటు శాంతి భద్రతల పరిరక్షణ అత్యంత కీలకంగా ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఓట్ల లెక్కింపు నిర్వహణపై పోలీసు శాఖను అప్రమత్తం చేస్తూ ఇప్పటికే ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ముందు రోజు నుంచే నిర్వహించాల్సిన విధి విధానాలపై క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిని వెతికిపట్టి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల ప్రకటన వెలువడిన మార్చి 16 నుంచి ప్రవర్తన నియమావళి అమలులో ఉంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో నిబంధనలు పక్కాగా అమలుపై పోలీసు శాఖ శ్రమిస్తోంది. ఓట్ల లెక్కింపు రోజు కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూసేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ఘట్టంలో చెదురుమదురు చోటు చేసుకున్న సంఘటనలు ఓట్ల లెక్కింపు సమయంలో పునరావృతం కాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

అప్రమత్తంగా అధికారులు...

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటినుంచి రౌడీషీటర్లపై పోలీసులు ఫోకస్ పెట్టారు. రౌడీషీట్లు ఉన్నవారు కొంతమంది ఇటీవల కాలంలో క్రిమినల్ కేసుల్లో పాల్గొన్నారు. అలాంటి వారికి గట్టిగానే కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రౌడీ షీటర్లతో పాటు నేర ప్రవర్తన ఉన్న సుమారు 5 వేల మందికి పైగా బైండోవర్ చేశారు. అయినా ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నిరసనలకు అనుమతి లేదు....

ఆర్‌యూలో ఈవీఎంల వద్ద కేంద్ర బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేసిన అధికారులు ఓట్ల లెక్కింపు రోజు ఆందోళనలు, ధర్నాలు, నిరసనలను నిషేధించారు. గెలిచిన అభ్యర్థులు, వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, డీజేలతో సంబరాలు నిర్వహించరాదని తేల్చి చెప్పారు. కౌంటింగ్ ప్రశాంతంగా పూర్తి చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే బాణసంచా విక్రయాలు, బాటిళ్లలో పెట్రోల్ అమ్మకాలను రద్దు చేశారు. కౌంటింగ్ ముందు రోజు నుంచే మద్యం అమ్మకాలను నియంత్రించే చర్యలకు ఆదేశించారు.

అవగాహన కార్యక్రమాలతో అప్రమత్తం...

ప్రశాంత కౌంటింగే లక్ష్యంగా పోలీసు శాఖ ఇప్పటికే వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలో నిర్వహించింది. జిల్లా అంతటా సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌తో పాటు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తోంది. ఎన్నికల ఫలితాలపై అల్లరి మూకల ఆందోళనలను కట్టడి చేసే దృశ్యాలను డెమో ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. ఆందోళనలు నిర్వహిస్తే అడ్డుకోవడం నుంచి బాష్పవాయువు ప్రయోగం, గాలిలోకి కాల్పులు, లాఠీ చార్జి, ఫైరింగ్ వంటి పోలీస్ చర్యలు, గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎలాంటి చర్యలు ఉంటాయో ప్రదర్శన రూపంలో చూపారు. ఓటర్ల తీర్పు వెల్లడయ్యే సమయం దగ్గర పడిన తరుణంలో మునుపెన్నడూ లేని విధంగా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లకు పోలీసు శాఖ సిద్ధమయ్యింది.

పోలీసుల వలయంలో ఆర్‌యూ

ఓట్ల లెక్కింపు జరిగే రాయలసీమ యూనివర్సిటీకి రెండు కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలు ఇప్పటికే పోలీసుల ఆధీనంలోకి వెళ్లాయి. దీంతో పాటు జిల్లా అంతటా సెక్షన్ 144 మరింత కఠినంగా అమలు చేయనున్నారు. ప్రజలు ఒకే చోట గుమికూడి ఉండటాన్ని ఈ చట్టం ద్వారా నిషేధించారు. పోలీసు యాక్ట్ సెక్షన్ 30 అమలు చేస్తున్నారు. దీని ద్వారా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించడానికి వీలు లేకుండా చర్యలు తీసుకున్నారు. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా వినియోగంపై నిషేధం విధించారు. ఆర్‌యూ పరిసర ప్రాంతాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించి బయటి వ్యక్తులు డ్రోన్‌లు వినియోగించకుండా నిషేధం విధించారు. 8 శాసనసభ, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి సీసీ కెమెరాల నిఘా నీడలో ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. దీని కోసం కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి శాంతి భద్రతలను పోలీసు అధికారులు పర్యవేక్షించనున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా కోసం అదనపు పోలీసు బలగాలతో పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు.

అల్లర్లలో పాల్గొంటే జీవితం నాశనమే



ఓట్ల లెక్కింపు రోజున తెలిసో తెలియకో యువత గొడవలు, అల్లర్లలో పాల్గొంటే కేసులు నమోదవుతాయి. ఇలా కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు రావు. ఎన్నికల సమరంలో విజేతలు ఎవరో తేలే సమయం దగ్గర పడిన తరుణంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. – ఎస్పీ కృష్ణకాంత్

శరీరంతో పాటు మనసుకూ చికిత్స అవసరం

- డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ రాధికారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): మనసుకు, శరీరానికి సంబంధమున్న వ్యాధులు ఇటీవల కాలంలో అధికమయ్యాయని, శరీరంతో పాటు మనసుకు, ఆలోచనలకు చికిత్స అందించాలని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి అన్నారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ(ఐపీఎస్) సౌత్ జోన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కర్నూలు సొసైటీ సహకారంతో శనివారం కర్నూలులోని మౌర్య ఇన్ హోటల్‌లో సౌత్ జోన్ మానసిక వైద్యుల సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల తర్వాత హెల్త్ యూనివర్సిటీకి ఒక మహిళ రిజిస్ట్రార్ కావడం, అందులో సైకియాట్రిస్ట్ రావడం మొదటిసారన్నారు. తాను ఐపీఎస్ చైర్‌పర్సన్‌గా కూడా పనిచేశానన్నారు. సైకో సొమాటిక్ వ్యాధులపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. 30 ఏళ్ల క్రితానికి ఇప్పటికీ మానసిక వైద్యుల సంఖ్యలో చాలా తేడా కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం దక్షిణ భారత దేశంలో మానసిక వైద్యుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. ప్రస్తుత సమాజంలో మానసిక వైద్యుల పాత్ర ఎంతో ఉందన్నారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎస్. సంజీవ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 18 శాతం ప్రజలు వివిధ మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు తేలిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వైద్యులు వైద్యశిబిరాలు నిర్వహించాలని కోరారు. ఏపీఎంసీ అబ్జర్వర్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తాను కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థినని, తనకు ఈ ప్రాంతంతో మంచి అనుబంధం ఉందన్నారు. ఇక్కడి హంద్రీనది తీరంలో సాయంత్రం వేళల్లో సేదతీరేవారమని గుర్తు చేసుకున్నారు. ప్రతి మానసిక వైద్యుడు ప్రతి 5 సంవత్సరాల్లో 30 క్రెడిట్ అవర్స్ సాధించాలని, ఇది మెడికల్ కౌన్సిల్ రెన్యువల్స్‌కు అవసరం అవుతుందన్నారు. క్రెడిట్ అవర్స్ ఇలాంటి సదస్సుల్లో పాల్గొడం వల్ల వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐపీఎస్ సౌత్ జోన్ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ అభయ్ మిట్కర్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. ఉమాశంకర్, డాక్టర్ పి. లోకేశ్వరరెడ్డి, సీఎంఈ చైర్‌పర్సన్ డాక్టర్ పీఎస్‌వీఎన్ శర్మ, ఐపీఎస్ ఏపీ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఐవీఎల్ నరసింహరావు, ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి. రమేష్‌బాబు, కార్యదర్శి డాక్టర్ కె. నాగిరెడ్డి పాల్గొన్నారు.



వెంకటగిరిలో శ్రీగిడ్డాంజనేయస్వామి రథోత్సవ దృశ్యం

రమణీయం.. రథోత్సవం

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో గిడ్డాంజనేయస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం రమణీయంగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. అంతకుముందు గిడ్డాంజనేయస్వామికి మాజీ కేంద్ర సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ఉత్సవ విగ్రహాన్ని, కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి రథంపై ఆశీనులను చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించడానికి మహిళలు, గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.

మలేరియాపై విస్తృతంగా అవగాహన



మలేరియా మాసోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): మలేరియాపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలలో, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. మలేరియా ఆడ అనాఫిలిస్ దోమకాటుతో వస్తుందన్నారు. ఈ దోమ మంచినీటిలో పెరుగుతుందని చెప్పారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించి దోమలు పుట్టకుండా, కుట్టకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. 2030లోపు మలేరియాను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, డెమో ప్రమీలాదేవి, హెచ్‌ఈఓ శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఓ హేమసుందరం, హెచ్‌ఈ పద్మావతి, ఎంపీహెచ్‌ఈఓ అభిమన్యుడు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ కేసులు సత్వరం పరిష్కరించండి

- డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): క్వాలిటీ కంట్రోల్ కేసులను సత్వరం పరిష్కరించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆదేశించారు. శనివారం డ్వామా విజిలెన్స్ విభాగం అధికారులతో క్వాలిటీ కంట్రోల్ పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్వాలిటీ కంట్రోల్ 354 కేసులు నమోదు చేయగా, 192 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. ఇంకా 124 మంది ఉపాధి సిబ్బందిపై 162 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అక్రమాలు జరగ లేదని భావిస్తున్నట్లు అయితే అందుకు సంబంధించిన రుజువులను వెంటనే సమర్పించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి ఈ నెల 15లోపు తగిన రుజువులు చూపితే డ్రాప్ చేస్తామని తెలిపారు. రుజువులు చూపలేకపోతే ఈ నెల 25లోపు దుర్వినియోగం అయిన సొమ్ము రికవరీ చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న 162 కేసులకు సంబందించి రూ.3.49 కోట్లు రికవరీ కావాల్సి ఉందని తెలిపారు. ఈ నెల చివరిలోపు క్వాలిటీ కంట్రోల్ కేసులను పరిష్కరించాలని విజిలెన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ అధికారి భాస్కర్, అసిస్టెంటు విజిలెన్స్ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: నందవరం మండలంలో కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో పట్టుబడిన మద్యాన్ని చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నందవరం మండలం కనకవీడు గ్రామానికి 2 కి.మీ దూరంలో దస్తగిరయ్య దర్గా దగ్గర తనిఖీలు చేస్తుండగా కనకవీడుకు చెందిన బీఎం. వెంకటేష్ వద్ద ఒక ప్లాస్టిక్ సంచిలో 576 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డిలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 37,000 ఉంటుందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన కోర్టులో హాజరుపరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నెంబర్ 9440902579కు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో ఎస్ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన నాగరాజు (ఫైల్)

ప్యాపిలి/పాణ్యం: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. పాణ్యంకు చెందిన నాగరాజు తన సోదరుడిని చూసేందుకు తల్లితో కలసి బైక్‌పై పాణ్యం నుంచి పెరవలికి బయలుదేరాడు. వెంగళాంపల్లి వద్దకు రాగానే సిమెంట్ ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అతివేగంతో అదుపుతప్పి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు, సుంకమ్మకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగరాజు కోలుకోలేక మృతి చెందాడు. సుంకమ్మను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కుమారి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

నాగరాజు కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో మండల యాంకర్‌గా పని చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణంలో సిబ్బంది, రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించారు. అలాగే పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చెర్మన్‌గా పని చేశారు.

ఏపీజీబీలో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 19వ వార్షికోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ బ్యాంకు వ్యాపార నిర్వహణలో ఇతర బ్యాంకుల కంటే ప్రగతి పథంలో ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విరివిగా రక్తదానం చేయాలని ఖాతాదారులను కోరారు. 70 సార్లకు పైగా రక్తదానం చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డిని అభినందించారు. రీజినల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్, ప్రధాన, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.